# పతనం

బ్రహ్మ రాక్షసిలా ఒక పొలికేక పెట్టి కదిలింది రైలు. పడకచుట్టను సర్ది పెట్టి తాపీగా కూర్చుంటూ మూడో సీటులో కూర్చున్న అమ్మాయి వైపు అప్రయత్నంగా చూశాడు బంగారు నాయుడు. ఒక్క క్షణం అతను తత్తరపాటుతో చూచి మళ్ళీ ఊపిరి పీల్చుకున్నాడు "ఆమె కాదు. కాదు... కాదు" అనుకొన్నాడు. కాని నిమిషం దొరలకముందే మళ్ళీ పైకిలేచి నిలబడి పరిశీలనగా చూచాడా మెను. ఆమె కాదనే నమ్మకం కలిగాక కూర్చున్నాడు.

రైలు వేగం హెచ్చుతూ వంది. అలా వేగం హెచ్చుతున్న రైలు పట్టాలను తప్పితే ఏమౌతుంది?

ఈ ప్రశ్న ఎందుకు పుట్టిందో బంగారునాయునికి అర్థం కాలేదు. కానీ ఎందులోనైనా ఒక క్రమం నియమం అంటూ వుండి తీరాలన్నది అతనికి మళ్ళీ ఒక్కసారి జ్ఞాపకానికి వచ్చింది. తన జీవితం కూడా అంతే. పట్టాలు తప్పిన రైలు బండిలాగే వుంది.

అసలు సూర్యకాంతం తన కెందు కిప్పుడు జ్ఞప్తికి రావాలి? ఆ మూడో సీటులో కూర్చున్న అమ్మాయి అచ్చంగా ఆమెలాగే వుంది. నిదానించి చూచాక ఆమె కాదని తేలింది. ఆమె పోలికలతో వున్నవారు కన్పించి నప్పుడే కాదు...మరెన్నో సందర్భాల్లో ఆమె స్మృతి పథంలో మెదులు తూనే వుంటుంది.

బంగారునాయుడు ఎదురుగా కూచుని పత్రిక చదువుతున్న ఆసామీవద్ద నుండి ఒక షీటు అందుకొన్నాడు. ఏవో వార్తలు చప్పగా వున్నాయి. ఆ క్రింద ఎవరో నూతన దంపతుల ఫోటో పడింది. ఆ ఫోటోను చూస్తూ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

ఒకనాడు తనూ తన సతీమణికూడా ఇలాగే అందరికీ పరిచయం చేయబడతామని అత నాశించాడు. అవును. తన ఆలోచనలు అలాంటివి. సూర్యకాంతం వంటి వుత్తమ యువతియొక్క ఆకాంక్షను తిరస్కరించింది అందుకోసమే...

ఆనాడు...నీరేశలింగం వర్ధంతి జరిగినవాడు ఆ సభలో తాను ప్రకటించిన ప్రతిజ్ఞ.

అతని ఒళ్లు జల్లుమన్నది. కనులలో నీరు చిప్పిల్లినది. తనకు తెలియకనే టప టప మంటూ నాలుగు చుక్కలు కూడా రాలిపోయినై.

అతడు తేప్పరిల్లుకొని కన్నీళ్లు తుడుచుకొని, ఆ పత్రికను ఎదుటి పెద్దమనిషి చేతికిచ్చి కిటికీ వైపు దృష్టిని మరలించాడు.

ఎవరో కుర్రాడు దూరాన గేదెపై ఎక్కి కూచుని వెడుతున్నాడు. వాడు అనుకుంటున్నాడు కావాలి ఏనుగుపై వూరేగుతున్నానని...అవును. అలా సంతృప్తిపడే జీవితాలే ఆనందదాయకాలు. తన లాగా కీర్తి దాహంతో సుడిగుండంలో పడడం అవివేక మనిపించింది. అందరిలాగా తానూ పెళ్ళి చేసికొనివుంటే బావుండును.

దేశంలో ఎందరో పితంతువులు సంఘంయొక్క ఇనుప పాదాలక్రింద పడి నలిగిపోతున్నారు. అడవి మల్లెలవలె రాలి పోతున్నారు. అలాంటివారిలో ఒక్కరిని పరిణయమాడి తానూ సంఘానికి సేవ చేస్తానని ఆనాడు ఆ నిండు సభలో, వీరేశ లింగం వర్ధంతి మహోత్సవంలో తన్నెరిగిన మిత్రుల మధ్య అతడు బాసచేశాడు.

బంగారునాయుడు భీష్ముని వంటివాడు కాకున్నా అంత గంభీరం కలవాడని ఒప్పుకోవాలి. ఆ సభలో బంగారునాయుని ప్రతిజ్ఞను విన్న ప్రతివారూ ప్రశంసించారు.

"బంగారునాయునివంటి ఆదర్శ యువకులు మన సంఘంలో వెయ్యిమంది కొక్కరున్నా చాలు. దేశం బాగుపడుతుంది" అన్నాడు అధ్యక్షుడు.

అంతేకాదు. ఆ రోజు కృతజ్ఞతాభినందనలు సమర్పించిన శ్రీమతి నళినీరావు అన్న మాటలు మరువరానివి.

"వీరేశలింగం బ్రతికే వున్నాడు. ఆ మహనీయుని తేజస్సును, విప్లవ భావాలను బంగారునాయునివంటి యువకుల్లో చూస్తూండటమే ఇందుకు నిదర్శనం అన్నదామె.

ఆ సభలో తాను ప్రకటించిన అభిప్రాయం సూర్య కాంతానికి తాను చెప్పేవరకూ తెలియదు. సూర్యకాంతం తల్లీ దండ్రి బంధువర్గమంతాకూడా బంగారునాయునికే ఆమె నిచ్చి వివాహం చేయడానికి నిశ్చయించారు. స్వగ్రామంలో ఆ సత్యం అందరూ ఎరిగిందే. ఆ వివాహానికి బంగారునాయుడు కూడా అడ్డుచెప్పడని అందరికీ తెలుసు. అతడు సూర్యకాం తాన్ని ఎంతో అభిమానంగా చూచుకొంటాడు. ఆమెనే

పెళ్ళి చేసుకొంటానని అతడు బహిరంగంగా చెప్పకపోయినా అంతరంగంలో అనుకొన్నాడు. ఒక్క సారి కాదు వెయ్యి మార్లు అనుకొన్నాడు. ఆమెను పెళ్ళి చేసుకోవాలని.

కాని కల్యాణం నిశ్చయంచేసే రోజున అన్నాడతను: "నా కిప్పుడే పెళ్ళి వద్దు. మరో అయిదు సంవత్సరాలు చేసుకోను."

ఈ నిర్ణయం విన్న బంధు మిత్రులు పిడుగు పాటులా భ్రమించి హతాశులై పోయారు. కారణాలు చెప్పడు. అమ్మాయిని గురించి ఏ అపోహలూ లేవంటాడు. అయినా వివాహానికి అంగీకరించడు.

చివరికి ఆ మరునాటి సాయంకాలం సూర్యకాంతమే తెగించి అడిగింది. అప్పు డన్నాడు బంగారునాయుడు:

"నన్ను క్షమించు కాంతం! నే నిప్పుడు చెప్పబోయే విషయం ఎవరికీ చెప్పనంటే చెబుతాను."

కాంతం ఏదో రహస్య ముందని అనుకొన్నది. పైగా అది తనకు సంబంధించే వుంటుం దేమో ననికూడా అనుమాన పడింది.

"అలాగే బావా! ఎవ్వరికీ చెప్పను. చచ్చినా చెప్పను. ఇప్పుడు చెప్పు" అన్నది సూర్యకాంతం.

"నేనొక ప్రతిజ్ఞ చేశాను. సంఘంలో చరిత్ర హీనులై పోతున్న వితంతు బాలికల్లో ఒక్కరినైనా వివాహం చేసుకోవాలని నిర్ణయించుకొన్నాను." అన్నాడు తాను.

అర్థ క్షణంకూడా ఆలోచించకుండా సూర్యకాంతం

అన్నది. "ఏదో పుణ్యం చేయాలనే ఆశతో పాపాగ్నిని మూట కట్టుకొంటున్నా"రని.

ఆమెతో వాదించ దలచుకోలేదు బంగారునాయుడు. ఆయనతో పేచీ పడాలని అనుకోలేదు సూర్యకాంతం. ఆమె సహజంగానే చాలా పౌరుషం గలామె. వెడుతూ వెడుతూ ఒక మాట మాత్రం అన్నది.

"ఇది స్త్రీ జనోద్ధరణ కాదు. ఆ పద్ధతే వేరు. మీ రేదో కీర్తి శిఖరాన్ని అందుకోవాలని చూస్తున్నారు. నేను మీకడ్డంరాను. నాదారిని నేను చూచుకొంటాను."

ఆ చివరి వాక్యం విన్నపుడు బంగారునాయుడు వులిక్కి పడ్డాడు. నాదారిని చూచుకొంటానంటే ఏ నుయ్యో గొయ్యో చూచుకొంటాననేగా అర్థం అనుకున్నాడు. అలాంటి ప్రమాదం ఎదురైతే ఏం చెయ్యాలని కాస్సేపు వణికిపోయాడు. మళ్ళీ తనకు తానే ధైర్యం చెప్పుకొని స్థిమితపడ్డాడు.

సూర్యకాంతం అన్నట్టు ఆమె దారిని ఆమె స్వయంగానే చూచుకొన్నది. ఆ గ్రామంలోనే నాలుగెకరాలు పొలంతో చక్కగా సేద్యం చేస్తున్న నీలాద్రినాయుణ్ణి పెళ్ళి చేసుకొన్నది.

చాలా మంచిపని చేసింది అనుకొన్నారు ఊరివారంతా. బంగారునాయుడు పెళ్ళినాడు మాత్రం తప్పుకొన్నాడు. తన మనస్సు అంత బాగుండకపోవడమే అందుక్కారణం.

పెళ్ళి అయిపోయింది. సూర్యకాంతం, నీలాద్రినాయుడు లక్షణంగానే కాపురం చేస్తున్నారని విన్నపుడు బంగారు

నాయుడెంతో ఆశ్చర్యపడ్డాడు. అలాగే మూడు సంవత్సరాలు దొర్లి పోయాయి.

బంగారు నాయుడు మాత్రం పెళ్ళి చేసుకో లేదు. ఎందరో అడిగారు కానీ కారణం చెప్పలేదు. తన ప్రతిజ్ఞ తనకు తెలుసు. ఆనాడు సభలో విన్న మిత్రులకు తెలుసు. బహుశా ఆ మిత్రులు, అధ్యక్షుడు మరచి పోవచ్చు. తన అంతరాత్మ మరువదు. తానూ మరచి పో లేడు. అంచేత ఆనాటి శపథాన్ని నెరవేర్చడమే తన కర్తవ్యం అనుకొన్నాడు.

బంధు మిత్రులమధ్య తానొక వితంతువును పెళ్ళి చేసుకోగలడు. కానీ తనకు నచ్చినామే కన్పించలే దతనికి. తన హృదయం సూర్యకాంతం వైపు మొగ్గు చూపినట్లు మరే యువతి వైపునకూ ఆకర్షించబడ లేదు. అత డెంతగానో ప్రయత్నించా డామెను మరచి పోవడానికి. వీలుకాలేదు. మరువలేకపోయాడు. ఆమె స్మృతి అతనిలో ఆలోచనా తరంగాలను సృష్టిస్తూనే వుంది. తానెక్కడికి పోయినా ఆమె నీడలాగా తన్ను వెంటాడుతూ వున్నట్లే తోస్తున్నది. ఏమిటీ విచిత్ర మనుకొన్నాడు. కొన్నాళ్లు పెళ్ళి ప్రయత్నానే మానుకొందామనుకొన్నాడు. అలాగే చేశాడుకూడా.

ఇంతలో వున్నట్టుండి ఒక సంఘటన జరిగిపోయింది. అనుకోని విధంగా అకస్మాత్తుగా నీలాద్రి నాయుడు చనిపోయాడని తనకు తెలిసినపుడు తన హృదయం తేలికపడింది. ఏదో అవ్యక్తానందం ప్రసన్నమెంది. అలాంటి వుత్సాహం తనలో ప్రస్ఫుటించడం మహా పాపమని అత డనుకొన్నాడు. ఎంతో ప్రయత్నంమీద దుఃఖ పడాలనీ, ఆ వేదన ననుభవించాలనీ అనుకొన్నాడు. కానీ అతనిలో ఆవేదనకు బదులు

ఆనందం, దుఃఖానికి ప్రతిగా సంతోషం కలుగుతుంటే అతడు అతన్నే సహించుకోలేకపోయాడు. తన్ను తానే నిందించుకొన్నాడు.

నీలాంద్రి నాయుడికి ఉత్తరక్రియలు కూడా జరిగిపోయాయి. సూర్యకాంతం సుమంగళి కాదు. ఆమె ఆడుజన్మ హక్కులనే పోగొట్టుకొన్నది. కానీ సంపాదించే సత్తావున్నా ఆ డబ్బుతో పూలు కొని జడలో ముడుచుకొనే అవకాశాన్ని కోల్పోయింది —

అనుకొన్నాడు బంగారునాయుడు. వందసార్లు అనుకొన్నాడు. తన నిర్ణయాన్ని ప్రకటించక ముందు తనలో తానే ఆలోచించుకొన్నాడు. ఒకనాటి సాయంకాలం సూర్యకాంతంతో అన్నాడు:

"నేను చెప్పే విషయం ఎవరికీ చెప్పనంటే చెబుతాను"

ఆమె నవ్వుతూనే అన్నది "నీకా భయం ఎందుకు బావా! ముందు నీవు చెప్పింది ఎవరికేనా చెప్పానా! ఇప్పుడూ అంతే" అని.

అతని ముఖం వికసించింది. సంతోషంతో అన్నాడు "నేను నిన్ను పెళ్ళి చేసుకొంటాను. నా ఆశయం నెరవేరినట్లుంటుంది. నీ బ్రతుకూ చివురిస్తుంది."

ఈ మాటలు విన్న సూర్యకాంతం గట్టిగా నవ్వి నిర్లక్ష్యంగా అన్నది "ఇది నీ ఆశయం కాదు. నీ స్వార్థం. నేను నీ స్వార్థానికి బలి కావాలని అనుకోలేదు. సంఘాన్ని వుద్ధరించడం నీలాంటి పిరికిపందలకు చేతకాదు. నీవంటి అసమర్థులమీద స్త్రీ లోకం ఆధారపడిందనుకొన్నావా బావా! విను...

నీలాద్రినాయుడు సేద్యం చేసే పల్లెటూరి బడుద్ధాయి అను కోకేం. నీలాంటి వాజెమ్మలు వెయ్యి మందయినా ఆయన కాలి గోరికి సరిపోగలరు. ఇంకో జన్మలోకూడా నే నాడుపుట్టకే పుడితే నా మెడలో పుస్తెకట్టేది ఆయనే అనుకో...అంటూ వెళ్ళిపోయింది.

బంగారు నాయుడు నిశ్చేష్టుడై నిలబడిపోయాడు.

* * *

అవును. ఆ రోజు తాను తెప్పరిల్లుకోడానికే పావు గంట పట్టింది.

ఆలోచిస్తున్న బంగారునాయుడు కిటికీ నుండి లోపలి వైపు తిరిగి చూశాడు. అందరూ దిగడానికి సన్నద్ధ మౌతున్నారు. తానూ వారి వెంబడి దిగాడు. అందరూ స్వర్ణముఖికేసి నడి చారు. స్నానాలు చేస్తున్నారు.

తన సమీపంలో ఒక జంట కొంగులు ముడివేసుకొని మునుగుతున్నారు.

ఓ వైపు నీటిలోకి దిగాడు...స్పెషల్లో ప్రయాణం చేస్తున్న బంగారునాయుడు.

కానీ అక్కడా తన స్మృతిపథంలో సూర్యకాంతం నృత్యం చేస్తూనే వుంది. ఎలా తప్పుకోవడం ఆ స్మృతి పథంనుండి? అందుకే పూర్ణయాత్రా స్పెషల్లో యాత్ర చేస్తున్నాడుపాపం!

యాత్ర చేస్తున్నకొద్దీ ఆమెను గురించిన ఆలోచనలు అధికమవుతున్నాయి, అవి తరిగే మార్గమే కన్పించడంలేదు. బంగారు నాయుడికి రాను రాను అతని మనస్సు చెడిపోతూ వుంది. చివరికి ఏమవుతానో అని తన్ను గురించి తానే భయ పడుతుంటాడు పాపం! బంగారు నాయుడు.